క్లుప్తంగా

కూటమి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వంపై ఎనిమిది నెలల్లోనే ప్రజలకు అసంతృప్తి నెల కొందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు పెరుగుతాయని, ప్రజలకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని, గత ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబుకు రాష్ట్రం అప్పుల్లో ఉన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలంటే కాకినాడ తీరంలోని గ్యాస్ చమురు నిక్షేపాల్లో మనకు రావాల్సిన వాటా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 23 న కాకినాడ గాంధీ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

ఉగాది పురస్కారాలకు ఆహ్వానం



రాజమాత లలితా రాణికి జ్ఞాపిక అందజేస్తున్న రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జాతీయస్థాయిలో నిర్వహించే ఉగాది పురస్కారాలకు శ్రీకృష్ణదేవరాయలు 18వ తరం వారసురాలు రాజమాత లలితా రాణి శ్రీరంగదేవరాయలు రానున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజయోనా ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. హంపిలో రాజమాత లలితారాణి శ్రీరంగదేవరాయలును శనివారం కలిసి, జ్ఞాపిక అందజేసి సత్కరించామన్నారు. అలాగే ఉగాది పురస్కారాలకు ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

23న సహస్ర గళ పారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సహస్ర గళ పారాయణ నిర్వహించనున్నారు. స్థానిక కన్వీనర్ మిర్తిపాటి వెంకట రామయ్య ఈ విషయాన్ని శనివారం ప్రకటనలో తెలిపారు. కల్వకొలను చిత్త రంజాన్ దాస్ స్మారక సేవాసంస్థకు అనుబంధ సంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమం జరుపుతున్నామన్నారు.


సమాజ సేవే ప్రధాన ధ్యేయం



స్కౌట్ విద్యార్థులతో ట్రస్టు ప్రతినిధులు

కడియం: సమాజానికి సేవ చేయడమే స్కౌట్ ప్రధాన ధ్యేయమని పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పల్ల సుబ్రహ్మణ్యం, వినయ్ అన్నారు. స్థానిక హైస్కూల్లోని స్కౌట్ విద్యార్థులకు రూ.పదివేల విలువైన యూనిఫాంను నివారం తమ ట్రస్ట్ ద్వారా అందించారు. కార్యక్రమంలో స్కౌట్ ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.గిరిజ, గైడ్ సహాయకులు వై.వీరరాఘవకుమారి, డేవిడ్ పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ వితరణ



ఇన్‌స్పెక్టర్‌కు కంప్యూటర్ అందజేస్తున్న సర్వారాయ సంస్థ ప్రతినిధులు

కడియం: స్థానిక పోలీస్ స్టేషన్‌కు వేమగిరిలోని సర్వారాయ బాట్లింగ్ యూనిట్ శనివారం కంప్యూటర్, ప్రింటర్ అందజేసింది. సీఎస్ఆర్ నిధులు రూ.70 వేలతో సమకూర్చిన వీటిని ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.శ్రీధర్, కె.కృష్ణమూర్తి, డి.సతీష్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్

ప్రకాశం నగర్: స్థానిక రైల్వే క్రీడా మైదానంలో భాష్యం స్కూల్ ఈస్ట్ -2 జోన్‌లోని ఏడు బ్రాంచ్‌ల మధ్య అట్టహాసంగా జరిగిన బాలుర ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. షటిల్, కబడ్డీ, రన్నింగ్, ఖోఖో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాలలో హోరాహోరీగా పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రకాశం నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ బాజీలాల్, భాష్యం జోనల్ ఇన్‌చార్జి వి.ఆంజనేయులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు.

దారి పొడవునా.. జారి పడేలా..

- లారీల నుంచి జారుతున్న ఇసుక
- వాహనచోదకుల అవస్థలు

రాజమహేంద్రవరం రూరల్: అక్రమార్కులకు ముఖ్య ఆదాయ వనరుగా ఇసుక మారింది. నిబంధనలను ఉల్లంఘించి, గోదావరి గర్భాన్ని కొల్లగొట్టి మరీ ఇసుకను తోడేస్తున్నారు. దాన్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇదే క్రమంలో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ముఖ్యంగా ఇసుకను రవాణా చేసే సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీలైనంత వేగంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే ఉద్దేశంతో పరిమితికి మించి లోడు చేస్తున్నారు. ప్రయాణ సమయంలో లారీ నుంచి ఇసుక రాలి రోడ్డు మీద పడడంతో వెనుక వచ్చే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

భద్రత గాలికి..

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులు.. వాహన చోదకుల భద్రతను కూడా గాలికి వదిలేస్తున్నారు. వీలైనంత వేగంగా దోచుకుపోవాలనే ఉద్దేశంతో వాహనాలపై పరిమితికి మించి లోడు వేసి తీసుకువెళుతున్నారు. ఇసుక రవాణా చేసే సమయంలో తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఇసుకపై ముూత వేసి తీసుకువెళ్లాలని నిబంధనలు చెబుతున్నాయి.



అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీ

పట్టించుకోని అధికారులు

పరిమితికి లోబడి లోడు చేసిన వాహనాలు వల్ల పెద్దగా ఇబ్బందులు కలగడం లేదు. కానీ పరిమితికి మించి లోడు చేసుకున్న వాహనాల నుంచి దారి పొడవునా ఇసుక జారి పడుతోంది. ఆ వాహనం పక్క నుంచి ప్రయాణించే వారి కళ్లల్లో ఇసుక పడడమే కాకుండా, వాహనాలు రోడ్డుపై జారిపడుతున్నాయి. రాత్రింబవళ్లు యథేచ్ఛగా అధిక లోడు తీసుకువెళుతున్నప్పటికీ పోలీసు, రవాణాశాఖలు పట్టించుకున్న దాఖలాలు లేవు.

దారంతా..

ప్రతి రోజూ ధవళేశ్వరం గాయత్రీ ఇసుక ర్యాంపు నుంచి లోడు లారీలు స్థానిక ఐఎల్‌టీజీ జంక్షన్, బాలాజీపేట, బొమ్మూరు జాతీయ రహదారి మీదుగా హుకుంపేట, రాజవోలు వైపు వెళుతున్నాయి. దారి పొడవునా అధిక లోడు వేసిన ఇసుక లారీ నుంచి రోడ్డు మలుపుల్లో ఇసుక జారి కింద పడిపోతుంది. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బొమ్మూరు, జాతీయ రహదారి వెంబడి రోడ్డుపైనా ఇసుక మేటలు పేరుకుపోతున్నాయి. నేషనల్ హైవే సిబ్బంది కొన్ని ప్రదేశాలలో పడిన ఇసుకను ప్రతిరోజు తీస్తున్నారు. కొన్ని చోట్ల చేయడం లేదు. దీని వలన వాహన చోదకులు జారిపడిపోతున్నారు.



ఫ్లై ఓవర్ ఎక్కే రోడ్డుపై జారి పడిన ఇసుక

నిత్యం ప్రమాదాలే..



అధిక ఇసుక లోడు వాహనాల నుంచి ఇసుక జారి రోడ్డుపై పడుతుంది. దీని వల్ల వెనుక వచ్చే వాహన చోదకులు జారిపడి పోతున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు స్పందించి అధిక ఇసుక లోడు లారీలను నియంత్రించి వాహన చోదకులకు ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– పెయ్యల రాజేష్, రాజవోలు

బొమ్మూరు జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి జారిపడిపోయాడు. తలకు హెల్మెట్ ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇలా ప్రతి రోజు ఎవరో ఒకరు జారిపడుతూనే ఉన్నారు. దీనిని పర్యవేక్షించాల్సిన రవాణా, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బొమ్మూరులో స్తంభించిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై బొమ్మూరు వద్ద స్తంభించిన ట్రాఫిక్

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై బొమ్మూరు వద్ద శనివారం రాత్రి గంటపాటు రెండు కిలోమీటర్ల మేర ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి ఏడుగంటల సమయంలో స్కూలు బస్సులు, ఇతర వాహనాలు ఒకేసారి రావడంతో నాలుగువైపుల వెళ్లేందుకు దారి లేక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానికులే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సి వచ్చింది. ట్రాఫిక్ తగ్గుతున్న సమయంలో కానిస్టేబుల్ వచ్చి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. బొమ్మూరు జంక్షన్‌లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

రాజమహేంద్రవరం సిటీ: రహదారుల భద్రతా నిబంధనలు సక్రమంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మురళీకృష్ణ, జిల్లా రవాణా అధికారి సురేష్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు శారీరక, మానసిక ఉత్సాహంతో వాహనాలు నడపాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 23 మంది ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించి, మెమెంటోలు అందించారు.రోడ్డు భద్రతపై వివిధ పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన 22 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక, రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించిన ఆర్టీసీ అధికారులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



రాజానగరంలో ప్రతిష్ఠించిన వాసవీమాత విగ్రహం



చక్రద్వారబంధంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

రాజానగరం: మండలంలోని రాజానగరం, చక్రద్వారబంధంలలో నూతనంగా నిర్మించిన ఆలయాలలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక రావుల చెరువు గట్టున ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం 11.30 గంటలకు మహాగణపతి సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఆర్యవైశ్య ప్రముఖుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగాయి.

- చక్రద్వారబంధంలో నిర్మించిన ఆలయంలో ఉదయం 10.54 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జయ, విజయ, గరుడ ఆళ్వార్, విష్వక్సేనుడు, వరాహ స్వామి విగ్రహాలు, శిఖర, యంత్రరాజ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు జరిగాయి.

టీచర్‌కు టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహం

కంబాలచెరువు: విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారానే బోధన సాధ్యం అని, టెక్నాలజీ ఎంత వచ్చినా టీచర్‌కు ప్రత్యామ్నాయం కాలేదని రాష్ట్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌పై దృష్టి సారించాలని, బడిఈడు పిల్లలందరూ విధిగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆసక్తికరంగా తరగతి గదిని రూపొందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్ సెషన్‌లో కమిషనర్ సూచనలు వెబెక్స్ ద్వారా విన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ మన ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేద పిల్లలే వస్తారని, వారి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. క్లస్టర్ సమావేశాలు ప్రతి నెలా మూడో శనివారం ఒకరోజు మాత్రమే జరుగుతాయని, ఒకవేళ ఆ రోజు సెలవు అయితే నాలుగో శనివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తకు ప్రశంసాపత్రం

రాజానగరం: జాతీయ స్థాయి శిక్షణలో చురుకైన పాత్ర వహించినందుకు దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావుకు ప్రశంసా పత్రం లభించింది. జాతీయ వ్యవసాయ కీటక వనరుల సంస్థ (ఎన్‌బీఏఐఆర్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కొబ్బరి పంటలో ఆశించే చీడపురుగుల నివారణకు ఉపయుక్తమయ్యే జీవనియంత్రణ చర్యలపై బెంగళూరులో ఐదురోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలతో జరిగిన చర్చలలో నరసింహారావు చురుకుగా వ్యవహరించారు.

ఏఐతో వైద్యరంగంలో పెను మార్పులు



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

రాజానగరం: వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు సంబంధించి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), జీనోమ్ మేపింగ్‌లు రాబోయే కాలంలో పెనుమార్పులు తీసుకువస్తాయని విజ్ఞాన్ యూనివర్సిటీ (గుంటూరు) చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శనివారం జరిగిన 17వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ వ్యాధులను సులువుగా గుర్తించడానికి ఆధార్ వంటి గుర్తింపు కార్డులపై ఆయా వ్యక్తుల జీన్స్‌ని నమోదు చేసే పరిస్థితి వస్తోందన్నారు. వైద్య విద్యార్థులు, వైద్యులు కూడా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం తప్పదన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన మాజీ ప్రొఫెసర్, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ మల్లా భాస్కరరావు, జీఎస్ఎస్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సంపద సృష్టి

రాజమహేంద్రవరం రూరల్: చెత్త నుంచి సంపద సృష్టించే విధానంలో ప్రజలను భాగస్వాములు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. బొమ్మూరులోని వైటీసీ ఆవరణలో శనివారం ఆమె ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో శాంతామణి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటి, స్వచ్ఛంధ్ర– క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉద్యోగులచే మూలం –వనరులు థీమ్‌తో ప్రతిజ్ఞ చేయించారు. శాంతమణి మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, సంపద సృష్టించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సీహెచ్ శ్రీనివాస్, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎ.దుర్గేష్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి ఎ.నాగ మహేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య, మార్క్‌ఫెడ్ డి.ప్రతాప్, ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

- సమాజంలో పరిశుభ్రత కోసం విద్యార్థులు కృషి చేయాలని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రవీణ అన్నారు. శనివారం కాతేరు వ్యవసాయ కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు.
- బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు.అనంతరం స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.
- ఆర్‌అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్‌బీవీ రెడ్డి , సిబ్బంది కార్యాలయం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.



వైటీసీలో మొక్కలు నాటుతున్న డీపీవో శాంతామణి తదితరులు

ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే ఆధ్వర్యంలో ఆవరణను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛతపై అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి, డాక్టర్ ఈసబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో..

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు, అధ్యాపకులు కలిసి శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు.



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి



ఆర్ట్స్ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

స్కూల్ ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆయాలు

రాజమహేంద్రవరం సిటీ: మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో పనిచేస్తున్న స్కూల్ ఆయాలకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని వారి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శాంతి, వై.ఝాన్సీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా మున్సిపల్ స్కూల్లో పనిచేస్తున్నామని, తమకు నెలకు రూ.4 వేలు జీతం ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వంతల రాంబాబు , మున్సిపల్ స్కూల్ ఆయాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

సీటీఆర్ఐ: మత్స్యకార కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తామని గోదావరి బోటు మత్స్యకారుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆ సంఘ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం పుష్కరాల రేవులో ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా మల్లాడి ఆంజనేయులు, కార్యదర్శిగా పాలెపు తులసీదాస్, ఉపాధ్యక్షుడిగా మల్లాడి సతీష్, సంయుక్త కార్యదర్శిగా మల్లాడి సుబ్బు, కోశాధికారిగా నాటి రామకృష్ణ, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలను అందించే విధంగా కృషి చేస్తామన్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

కంబాలచెరువు: ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుని మహిళ మృతిచెందిన సంఘటన ఆనంద్ నగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....పులవర్తి శోభ (72) ఉదయం ఇంటి మేడపై ఎండుటాకులు తుడవటానికి వెళ్లింది. వాటన్నింటినీ తుడిచి భవనంపైనే ఒకే చోట వేసి అంటించింది. ఈ క్రమంలో ఆమె చీరకు నిప్పంటకుంది. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి మహిళ మృతి

కంబాలచెరువు: పురుగుల మందు తాగి మహిళ మృతి చెందిన సంఘటన ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఆలమూరుకు చెందిన పెదిరెడ్డి నాగలక్ష్మిదుర్గ (28),ఆమె భర్త కలిసి హైదరాబాద్‌లో నర్సరీ నిర్వహిస్తుంటారు. ఆమెకు ఆరోగ్యం సరిగా ఉండదు. ఈనెల ఒకటో తేదీన ఆమె నర్సరీలోని పరుగుల మందు తాగింది. దీంతో ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం ఈ నెల 5వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

సీతానగరం: పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జాతీయ ప్రచురణ విభాగ ప్రతినిధి హాఫీజ్ సయ్యద్ రసూల్ నియాజ్ అన్నారు. వంగలపూడిలోని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మసీదులో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధార్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ పఠించాలని సూచించారు. పుస్తక పఠనంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే సామాజిక సమస్యలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: కెప్టెన్ అమెరికా
సూర్య ప్యాలెస్	: పట్టుదల
స్వామి	: బ్రహ్మ ఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ	: లైలా
రాజా	: తండేల్
ఊర్వశి	: కాంప్లికేటెడ్
మేనక	: నిదురించు జహాపన, తల
రంభ	: ఆరెంజ్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అప్సర	: తండేల్
అశోక	: లైలా
నామవరం	
వీఎస్ మహల్	: తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తండేల్
కడియం	
వెంకటసూర్య	: లైలా